క్లుప్తంగా

రుచికరమైన భోజనం



వంట నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పూతలపట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం పెడుతున్నారని ఎంపీడీఓ గౌరి అన్నారు. బుధవారం పి.కొత్తకోట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం రుచిచూచి, నాణ్యమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంచాయతీ సెక్రటరీ జరీనాతాజ్ పాల్గొన్నారు.

శ్రద్ధతో పరీక్షకు సన్నద్ధం కావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షకు ఏకాగ్రతతో, శ్రద్ధతో చదవాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. పరీక్ష సమయం దగ్గర పడిందని విద్యార్థులు ఒత్తిడికి గురికాకూడదన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలిపారు. హెచ్‌ఎం దామోదరనాయుడు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఏఆర్ విభాగంలో ఆనంద్‌మోహన్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ గత నెల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబానికి విడో ఫండ్ నుంచి రూ. 50వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ. 25వేల చెక్కును బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి మృతుడి భార్య ఉషారాణికి చెక్కును అందజేశారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని నెల్లూరుకు చెందిన రాధాకృష్ణారెడ్డి కుటుంబసభ్యులు ఆలయ అధికారులకు అందజేశారు. బుధవారం సాయంత్రం దాత కుటుంబసభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు వరం ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు వరం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమమని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం మాధవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక 70 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా గర్భిణులకు పరీక్షలు చేయించారు. బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు రామాలయంలో ప్రత్యేక పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి వెంకటగిరి గ్రామంలో గురువారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కోదండరామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తులసీ రామకృష్ణారెడ్డి, శిరీష్‌రెడ్డి, చైర్మన్ ప్రకాష్ తెలిపారు. కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని సీతారామస్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మహిళలకు ఆసరా

- మహిళల అభ్యున్నతే ధ్యేయం
- నియోజకవర్గంలో 3,406 గ్రూపులకు ఆసరా నిధులు రూ.32 కోట్లు విడుదల



సచివాలయంలో సీఎం జగనన్న ప్రసంగాన్ని తిలకిస్తున్న పొదుపు సభ్యులు (ఫైల్)

గుడిపాల: అక్కాచెల్లెమ్మల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పొదుపు సంఘాల మహిళలకు రుణమాఫీ చేశారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ అప్పు మొత్తాన్ని నాలుగు విడతలుగా విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లా దెందులూరు నుంచి మూడో విడత ఆసరా నిధులు విడుదల చేశారు. వీటని పొదుపు మహిళా సంఘాలు వీక్షించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద 3,406 గ్రూపులకు రూ.32 కోట్ల 72లక్షలు విడుదల చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే...

మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా నగదు జమ చేయడంతో పొదుపు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా రాష్ట్రప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత అందజేయడంతో వారి అభ్యున్నతికి దోహద పడుతోంది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు చేతి వృత్తులు, కిరాణా, బట్టలు, కూరగాయల దుకాణాలు, కుట్టుమిషన్లు, గొర్రెలు, మేకలు, ఆవుల పెంపకం, పాలవ్యాపారం రంగాల్లో రాణించి స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి చేయూతనిస్తున్నారు.

మున్సిపాలిటీ పరిధిలో దుకాణం పెట్టుకున్నా..



వసంతాపురం గ్రామంలో దుర్గమ్మ పొదుపు గ్రూపు సంఘం సభ్యురాలిగా చేరి బ్యాంక్ లింకేజీతో తీసుకున్న నగదుతో టైలర్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నా. వైఎస్సార్ ఆసరా పథకం కింద మా గ్రూపునకు రూ.1.25 లక్షలు వచ్చింది. మూడు విడతలుగా లబ్ధిపొందాం. అంతేకాక వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత పథకాలు అందడంతో వ్యాపార నిర్వహణకు అండ లభిస్తుండడం సంతోషంగా ఉంది..

నీలావతి, వసంతాపురం, గుడిపాల

జీవనోపాధికి చేయూతనిస్తోంది.



రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తోంది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాం. దీంతో మహిళలు స్వయం పోషణ చేసుకుని కుటుంబానికి అండగా నిలుస్తారు. వారి పిల్లలకు మంచి విద్యను అందిస్తున్నారు.

ఈశ్వరి, ఏపీఎం, గుడిపాల

మహిళాభ్యున్నతికి జగనన్న ఎనలేని కృషి



గుడిపాల: ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- గుడిపాలలో ఆసరా సంబరాలు



హాజరైన మహిళలు

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి ఎనలేని కృషిచేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం గుడిపాలలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆసరా సంబరాలు నిర్వహించారు. 761 పొదుపు మహిళా సంఘాలకు రూ.6.68 కోట్ల రుణాల చెక్‌ను అందజేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉన్నతి రుణాలను 353 మందికి గాను రూ.కోటి 75లక్షల 6వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పొందిన రుణాలతో మహిళలు మెరుగైన జీవనోపాధులను కల్పించుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో పొదుపు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే మూడో విడత ఆసరా పథకం అమలు చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కేవలం జన్మభూమి కమిటీ సిఫారసు చేసిన వారికే అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పార్టీలు, కులమతాలు, రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, సర్పంచులు రజినీకాంత్, మోహన్, ప్రసాద్‌రెడ్డి, జయకోడి, గుణవతి, వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీధర్‌రెడ్డి, సాము వేలు, కలైఅరసి, కారిమేగన్, సంపత్, శింబు, సాయి, వెంకటేష్‌రెడ్డి, రవియాదవ్, ఏపీఎం ఈశ్వరి, ఎంపీడీఓ ఉపేంద్ర పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు విస్తృతం



ఫ్యామిలీ వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను గ్రామాల్లో మరింత విస్తృతం చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రకాశం అన్నారు. బుధవారం గుడిపాలలోని కిల్లారిపల్లెలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్యంతో ఉన్నవారికి ఇంటి దగ్గర పరీక్షలు చేయడం వాటిపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు కచ్చితంగా అందేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలో వైద్యసేవలు సకాలంలో అందుతున్నాయా లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలకు సంబంధించి రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా ఆయన పరిశీలించారు. ప్రాథమిక వైద్యాధికారి సుకన్య, ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, డీఈఎంఓ జయరాములు, సీహెచ్‌ఓ నరసింహమూర్తి, సిబ్బంది విజయ, సునీత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. బుధవారం నాంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్యశిబిరంలో 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేసుకున్న రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఎత్తు, బరువు పరీక్షలు చేశారు. బరువు తక్కువ ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: ప్రభుత్వ సెలవుల కారణంగా మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీని ఏప్రిల్ 3వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ తెలిపారు. ప్రతి నెలా తొలిరోజు నుంచే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అయితే బ్యాంకు కార్యకలపాలు, ప్రభుత్వ సెలవుల కారణంగా ఏప్రిల్ 3 నుంచి పంపిణీ చేస్తున్నామని, పింఛన్‌దారులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు

చిత్తూరు రూరల్: నగరంలోని పలు ఆలయాలు శ్రీరామనవమికి ముస్తాబయ్యాయి. కోదండరామస్వామి ఆలయం, పొన్నియమ్మ గుడివీధిలోని వీరాంజనేయస్వామి ఆలయం, గిరింపేటలోని వీరాంజనేయస్వామి ఆలయం, పోలీసు క్వార్టస్, టాప్‌లైన్, తోటపాళ్యంలో గురువారం వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఆలయాలను ఆలయ నిర్వాహకులు ముందుగానే సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం వేకువజాము నుంచే ప్రత్యేక అభిషేక పూజలు ప్రారంభంకానున్నాయి. అలాగే పలు ఆలయాల్లో స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

త్వరలో కొత్త డీటీసీ

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లాకు కొత్తగా డీటీసీ రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇక్కడ డీటీసీగా పనిచేస్తున్న బసిరెడ్డికి ఇటీవల తిరుపతి జేటీసీగా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు ఆయన అక్కడి పదవి బాధ్యతలను చూసుకుంటూ జిల్లా డీటీసీగా అదనపు బాధ్యతలను చూసుకుంటున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం జిల్లాకు డీటీసీ నియామక ప్రక్రియను పూర్తి చేస్తోందని, ఏప్రిల్ 2వ తేదీకి కొత్త డీటీసీ జిల్లాకు రావచ్చునని సమాచారం.

హనుమంతుడిపై శ్రీరామచంద్రుని చిద్విలాసం



హనుమంత వాహనంపై శ్రీరామచంద్రుడు

తవణంపల్లె: కోదండరామ స్వామి దేవస్థానం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హనుమంతుడి వాహన సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ఆలయంలో సీతారామలక్ష్మణులకు, ఆంజనేయస్వామికి అభిషేకం చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉభయదారులు విశ్వబ్రాహ్మణ వంశస్థులచే హనుమంత వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. సుగంధ పుష్పాలతో అలంకరించిన హనుమంత వాహనంపై శ్రీరామచంద్రుడు పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు..

తవణంపల్లెలో వెలసియున్న కోదండరామస్వామి దేవస్థానం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని కార్యనిర్వాహకులు తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్: చిత్తూరులోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన తిరుమంజనం, మహా స్నపన తిరుమంజనం, అంకుర్పాణం పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. ముందుగా స్వామి వారికి అభిషేక పూజలు చేసి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఉభయదారులను సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. చైర్మన్ సకల వెంకటేష్ గుప్తా, సభ్యులు రాజా, మాధవి, అర్చకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి

ఐరాల: ఎండా కాలంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు ఎండలు ఎక్కువ అవుతున్నామన్నారు. ప్రజలు తెల్లటి నూలు, లేతరంగు వస్త్రాలు ధరించాలని సూచించారు. వృద్ధులు, చిన్న పిల్లలకు వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. తాజాకాయగూరలు, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు అధికంగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి వెంటనే వైద్యం అందించకుంటే ప్రాణహాని కలిగే అవకాశం ఉందని చెప్పారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



అంగన్‌వాడీలో గర్భిణులకు సీమంతం

గుడిపాల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. పోషణ్ పక్వాడ వేడుకల్లో భాగంగా బుధవారం గొల్లమడుగు, పల్లూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడం వలన వారిలో పోషక విలువలు పెరుగుతాయన్నారు. బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ కన్యాకుమారి పాల్గొన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు

చిత్తూరు రూరల్: చిత్తూర్ -తచ్చూర్ హైవే రోడ్డు పనులను ఎగువమాసపల్లె రైతులు బుధవారం అడ్డుకున్నారు. ఎగువమాసనపల్లెలోని రైతుల పొలాల్లో చిత్తూరు తచ్చూర్ హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కానీ రోడ్డు వెడల్పులో భూములు కోల్పోయిన నలుగురు రైతులకు పరిహారం ఇవ్వలేదని రోడ్డు పనులు అడ్డుకున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. మాకు పరిహారం ఇవ్వండి తరువాత పనులు ప్రారంభించాలని అడ్డుకున్నారు.

కూలీలకు గిట్టుబాటు అయ్యేలా చూడాలి

చిత్తూరు రూరల్: వ్యవసాయ కూలీలకు దినసరి కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాలని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ కార్యదర్శి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర సరుకులను రాయితీతో అందించాలని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్‌ను రూ. 400లకే అందించాలని తెలిపారు.

మాక్‌డ్రిల్‌కు ముందస్తు ఏర్పాట్లు

చిత్తూరు రూరల్: కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తోంది. దీంతో జిల్లా యంత్రాంగం అధికారులకు సూచనలు చేసింది. ఏప్రిల్ 10,11 తేదీల్లో మాక్‌డ్రిల్ చేపట్టాలని అధికారులు నిర్ణయించుకున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

చిత్తూరు రూరల్: చిత్తూరులోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో డీఎంఅండ్‌హెచ్‌ఓ జి. ప్రకాశం తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా స్కానింగ్ సెంటర్ల నిర్వహణపై ఆరా తీశారు. నిబంధనల మేరకు పని చేస్తున్నాయా లేదా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్‌ఓ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారం

చిత్తూరు రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకుని చిత్తూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సభ్యులు సహదేవనాయుడు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రచయితలు, కవులు, సాహితీ ప్రియులు, కళాకారులు పాల్గొన్నాలని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నేతల నివాళి

చిత్తూరు అర్బన్: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని చిత్తూరులో ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని పలు కూడళ్లల్లో టీడీపీ జెండాలు ఎగురవేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాజీ మేయర్ హేమలత, పార్టీ నేతలు వసంత్‌కుమార్, కోదండ యాదవ్, దశరథ వాసు, వెంకటేష్, సుబ్రి, కందస్వామి, అత్తు పాల్గొన్నారు.

చెత్తశుద్ధితో ఆదాయం



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- సత్ఫలితాలతో డంపింగ్ యార్డులు
- ట్రైసైకిల్‌లో తడి, పొడి చెత్త సేకరణ
- వర్మీకం పోస్టు తయారీ..విక్రయం
- పంచాయతీకి ఆదాయం

పూతలపట్టు: గ్రామాల్లో చెత్త సేకరణ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు పంచాయతీకి ఆదాయ వనరుగా మారింది. నాడు చెత్త చెదారంతో అస్తవ్యస్తంగా ఉన్న పల్లెలు నేడు సుందరంగా మారాయి. ఫలితంగా గ్రామాల్లో పరిశుభ్రత వెల్లివిరుస్తోంది. చెత్తను ఎరువుగా తయారు చేసి పంచాయతీకి ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ఈవిధానంలో కొన్ని పంచాయతీలు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

పూతలపట్టు మండలంలో 25 పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీల్లో 274 గ్రామాలకుగాను 12,270 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అధికారులు దృష్టి పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల స్వచ్ఛతకు శ్రీకారం చుట్టింది. విధిగా పంచాయతీల్లో చెత్త సేకరణను చేపడుతోంది. అధికారులు సేకరణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఇంటా గ్రీన్ అంబాసిడర్లు చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. సేకరించి వాటిని ఐదు రకాలుగా విభజిస్తారు. ప్లాస్టిక్, గాజు సీసాలు, చిత్తు కాగితాలు, పాత ఇనుప, పాత సంచులుగా వేరు చేస్తారు. చెత్తను వర్మీకంపోస్టు ఎరువుగా విక్రయిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాలకు జమచేస్తున్నారు. పంచాయతీల్లో తలెత్తే సమస్యలకు ఆ నిధిని వాడుకుంటున్నారు.

నాలుగు పంచాయతీలు ఆదర్శం..

మండలంలో 14 డంపింగ్ యార్డులు ఉండగా వాటి ద్వారా ఏడాదికి 8 వేల కేజీల ఎరువు తయారవుతోంది. వీటిని విక్రయించగా రూ.లక్ష ఆదాయం సమకూరుతోంది. ప్రధానంగా పి.కొత్తకోట చెత్త సేకరణతో పాటు ఎరువుల విక్రయం, ఆదాయంలో ముందు వరసలో ఉంది. ఏడాదికి ఈ పంచాయతీకి డంపింగ్ యార్డు నుంచి రూ.55 వేల వరకు ఆదాయం వస్తోంది. తేనేపల్లి పంచాయతీలో 800 కేజీల వరకు చెత్త సేకరణగా జరగగా ఆదాయం రూ.20 వేలకు పైగా వస్తోంది. కమ్మగుట్టపల్లిలో 700 కేజీలవరకు చెత్త సేకరించగా రూ.10 వేలు, ఏర్రచెరువు పల్లి 517 కేజీలకు..410 కేజీల చెత్తతో రూ.5 వేల ఆదాయం వస్తున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. మిగిలిన పంచాయతీల్లో కూడా ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. చెత్త సేకరణతోపాటు ఎరువు తయారీపై దృష్టిపెడుతున్నారు. కాగా నాలుగు పంచాయతీలు మాత్రం చెత్త సేకరణలో ఆదర్శంగా నిలుస్తున్నాయి.

అందరి సహకారంతోనే...



గ్రామ కమిటీ అధ్వర్యంలో చెత్త, చెదారాలను తొలగిస్తున్నాం. తడి, పొడి చెత్త వేరు చేసి గ్రీన్ అంబాసీడర్లకి అందిస్తున్నాం. అందరి సహకారంతోనే స్వచ్ఛ గ్రామం తయారవడానికి వీలైంది.

ఎం.జరీనాతాజ్, పంచాయతీ కార్యదర్శి, పి.కొత్తకోట

సంపద కేంద్రం అభివృద్ధి..



ప్రభుత్వ ఆదేశాల మేరకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. వీటి ద్వారా ప్రజల్లో చాలా మార్పులు గమనించాం. గ్రామాల్లో పరిశుభ్రత నెలకొంది. తద్వారా పంచాయతీకి ఆదాయాన్ని కూడా సమకూరుస్తున్నాం.

పి. గౌరి, ఎంపీడీఓ, పూతలపట్టు